

అడవిలో 'ఉపాధి' 8లో▸

అడవులపై ఆధారపడి, అటవీ సంపదతో జీవించే వారికి అటవీశాఖ ఉపాధి హామీ పథకంతో పని కల్పిస్తోంది. అటవీ సంపదతో అవసరం లేకుండా చేతినిండా పని లభిస్తోంది.



నమోదులో లోపం..

ప్రజాపాలన దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్ లేక గృహజ్యోతి, మహాలక్ష్మి అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో తప్పిదాలతో పథకాలకు అర్హత కోల్పోతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.0 /28.0

ఉదయం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

కోటపల్లి: రానున్న వర్షాకాలంలో ప్రజా రవాణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి రాజారం, నక్కలపల్లి గ్రామానికి వెళ్లే దారులు అటవీ అనుమతులు లేకుండా ఆగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయం స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. వర్షాలు కురిస్తే ప్రజా రవాణాకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న, ఇతరత్రా కారణాలతో ఉన్న వారు వర్షాకాలంలో ముందస్తుగానే సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులకు వైద్యసేవలు, ఇతరత్రా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎంపీడీవో భూమన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'

బెల్లంపల్లిరూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కన్నాల రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు భరోసా పథకం మార్గదర్శకాలపై వ్యవసాయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ గోపితో కలిసి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పది ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు పథకం అందేలా చూడాలని రైతులు కోరారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేఖ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు పంపిస్తామని తెలిపారు. అనంతరం పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భీమిని ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల వ్యవసాయ శాఖ అధికారులు ప్రేమ్‌కుమార్, కిరణ్మయి, వందన, ఏఈవోలు నాగదీప్తి, శ్రీనివాస్, ధనలక్ష్మి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ కార్యక్రమాల పోస్టర్లు విడుదల



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాలటౌన్: జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించనుండగా.. ఈ నెల 27నుంచి జూలై 10వరకు కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పోస్టర్లను మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత విడుదల చేశారు. వైద్యాధికారులు, సూపర్‌వైజర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలతో గ్రామాల్లో అర్హులైన దంపతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కుటుంబ నియంత్రణ, తాత్కాలిక, శాశ్వత పద్ధతులపై తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ ప్రశాంతి, డెమో వెంకటేశ్వర్లు, ఎస్‌వో దామోదర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ధర్నా

మంచిర్యాలఅగ్రికల్చర్: నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్చి 4 లెబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందని, ఇది కార్మిక వర్గానికి చాలా ప్రమాదకరమని తెలిపారు. లక్ష కోట్ల లాభాలను సమకూర్చే ప్రభుత్వ రంగ సంస్థలను కాదని అంబాని, అదానీ కంపెనీలకు కట్టబెట్టడానికి కార్మిక చట్టాలను మార్చారని విమర్శించారు. రాష్ట్ర అసెంబ్లీలో నాలుగు బేబర్ కోడ్స్ రద్దుకు తీర్మానించి కేంద్రానికి పంపించాలని అన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, నాయకులు జాఫర్, మల్లన్న, సోమన్న, గణేష్, సాజిద్ పాల్గొన్నారు.

ఏసీబీ దూకుడు



- జిల్లాలో పలు శాఖల ఉద్యోగుల అప్రమత్తం
- కేసులతోపాటు ఉద్యోగం కోల్పోతామనే భయం
- లంచం అడగాలంటే ఆ అధికారుల్లో కలవరం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అవినీతి నిరోధక శాఖ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు శాఖల్లో లంచగొండి అధికారులు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. పోలీసుశాఖ, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రార్, ఆర్టీఏ, విద్య, వైద్యారోగ్య, పశుసంవర్ధక శాఖలు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలపై ఇప్పటికే ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు ఓ కన్నేసి ఉంచారు. లంచావతారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు వేచి చూస్తున్నారు. ఇప్పటికే పలువురు అధికారులపై ఆ శాఖ అధికారిక ఫోన్ నంబర్లకు ఫిర్యాదులు వెళ్లాయి. అయితే సదరు అధికారులు పట్టుబడే వరకు ఎక్కడా కేసు వివరాలు బయటకు వెల్లడించరు. అత్యంత గోప్యంగా ఆపరేషన్ పూర్తి చేస్తారు. ఈ క్రమంలో జిల్లాలోనూ పలు శాఖలపై ఏసీబీ దృష్టి సారించడంతో టెన్షన్ నెలకొంది.

ఆర్‌ఎంపీలపై కేసుల విషయంలో..

అర్హతకు మించి వైద్యం చేస్తున్నారంటూ మెడికల్ కౌన్సిల్, వైద్యారోగ్యశాఖ తనిఖీల్లో 12మందికి పైగా ఆర్‌ఎంపీలపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. పోలీసుస్టేషన్లలో నమోదైన కేసులతో ఆర్‌ఎంపీలు ఇబ్బందులు పడుతున్నట్లుగా వైద్యారోగ్య శాఖ అధికారులకు మొర పెట్టుకున్నారు. చాలామంది క్లినిక్‌ల్లో పేరు ముందు డాక్టర్ అని, ఆసుపత్రి తరహాలో వైద్య చికిత్స అందించే విధానానికి స్వస్తి పలికారు. కొందరు ఆర్‌ఎంపీలపై పలు పోలీసుస్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీరిలో మంచిర్యాల, నస్పూర్, శ్రీరాంపూర్, వేమనపల్లి, బెల్లంపల్లి మండలాలకు చెందిన ఆర్‌ఎంపీలు ఉన్నారు. స్టేషన్ బెయిల్ కోసం తమను వేధించినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారుల సమక్షంలోనే బాధిత ఆర్‌ఎంపీలు వాపోయినట్లు సమాచారం. రెండు సార్లు కేసు నమోదైన ఓ ఆర్‌ఎంపీని రూ.80వేల వరకు అడిగితే అంత ఇచ్చుకోలేమని, మరో ఆర్‌ఎంపీతో కలసి రూ.60వేల వరకు ముట్టజెప్పామని తెలిపినట్లు సమాచారం. ఇదంతా జిల్లా ఆర్‌ఎంపీల సమావేశంలోనే గోడు వెళ్లబోసుకున్నారు. నస్పూర్, శ్రీరాంపూర్ పరిధిలో నమోదైన కేసుల విషయంలోనూ వసూలు చేసినట్లు చర్చ నడుస్తోంది. ఈ వ్యవహారంలో ఎవరో తెలివిగా ఏసీబీ పేరును వాడుకున్నట్లుగా తెలుస్తోంది. పోలీసు అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు.

కలెక్టరేట్‌లోని ఉద్యోగులపైనా..

కలెక్టరేట్‌లో ఉన్న ఓ సెక్షన్ అధికారిపై ఫిర్యాదు వెళ్లినట్లు తెలిసింది. డబ్బుల కోసం తమ పని చేయకుండా తిప్పించుకుంటున్నారని ఓ బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు సమాచారం. మరో శాఖ పరిధిలో కొద్ది నెలల క్రితం పనులు చేసిన ఓ ఆంధ్రా కాంట్రాక్టరును బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తుండడంతో ఆయన ఏసీబీకి పట్టిస్తామని బెదిరించినట్లు సమాచారం. జిల్లా పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ శాఖలోని ఆర్డీవో పరిధి, రవాణా శాఖలో ఏజెంట్లు, మధ్యవర్తులు, సిబ్బందితో నడిపిస్తున్న తతంగంపై నిఘా కొనసాగుతోంది.

పోలీసుస్టేషన్లపై ప్రత్యేక దృష్టి..

జిల్లా కేంద్రంతోపాటు కోల్‌బెల్ట్ ఏరియాల్లోని పలు ఠాణాలపై పలు ఫిర్యాదులు ఏసీబీకి వెళ్లినట్లు సమాచారం. బాధితులు ఫోన్‌లోనే ప్రాథమిక సమాచారం చేర వేసినట్లు సమాచారం. బాధితుల సాయంతో సదరు అధికారులను ట్రాప్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. కానీ కొందరు బాధితులు చివరి వరకు సహకరించకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారుల దూకుడు, బాధితుల్లో వస్తున్న చైతన్యంతో జిల్లాలో అవినీతి తగ్గిపోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎవరైనా పట్టించవచ్చు..

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే బాధితులే కాకుండా, ఎవరైనా ఏసీబీ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. ఫోన్, వాట్సాప్, ఈ మెయిల్, పోస్టల్ ద్వారానైనా వివరాలు పంపొచ్చు. ఫిర్యాదు దారుడి వివరాలన్నీ గోప్యంగా ఉంచుతారు.

టోల్‌ఫ్రీనంబరు: 1064
ఫోన్ నంబరు : 9140 23251 555
వాట్సాప్ : 9440446106
ఆదిలాబాద్ రేంజ్ డీఎస్పీ: 9154388963
మెయిల్: dg_acb@telangana.gov.in

ఎంపీల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నగేష్



ప్రమాణస్వీకారం చేస్తున్న వంశీకృష్ణ

ఆదిలాబాద్/చెన్నూర్: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ రాధామోహన్ సింగ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. గోడం నగేష్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. గడ్డం వంశీకృష్ణ సింగరేణి పారిశ్రామిక ప్రాంత ప్రాముఖ్యతను తెలియజేస్తూ సింగరేణి కార్మికుడి డ్రెస్‌లో ప్రమాణ స్వీకారం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇంగ్లిషులో ప్రమాణ స్వీకారం చేశారు. వంశీకృష్ణకు చెన్నూర్‌కు చెందిన మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, కౌన్సిలర్ పోగుల సతీశ్, శ్రీనివాస్ ఢిల్లీలో శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీల జాతర

- వరుసగా ఉన్నతాధికారులకు స్థానచలనం
- డివిజనల్, మండల అధికారులకు ట్రాన్స్‌ఫర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం తమదైన పాలన చూపించేందుకు సిద్ధమైంది. వరుస ఎన్నికలతో పాలనలో అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో మళ్లీ గాడిన పెట్టేందుకు ఇప్పటికే పలు శాఖల్లో ప్రక్షాళన చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఉన్నతాధికారులను బదిలీ చేసింది. దీంతో జిల్లాలోనూ ఉన్నతాధికారులు బదిలీ అవుతున్నారు. మొదట కలెక్టర్ బదావత్ సంతోష్ స్థానంలో కుమార్ దీపక్ వచ్చారు. జిల్లా పోలీసు బాస్‌కు స్థాన చలనం కలిగింది. డీసీపీ అశోక్‌కుమార్ బదిలీ కాగా, ఆయన స్థానంలో ఏ.భాస్కర్ వచ్చారు. సోమవారం జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాల్సి ఉంది. ఇలా జిల్లాలో ప్రధాన ఉన్నతాధికారులు కొత్తగా రావడంతో పాలనపై దృష్టి సారించేందుకు సిద్ధమయ్యారు.

ఇక డివిజనల్, మండల స్థాయి

జిల్లా ఉన్నతాధికారులు బదిలీ అయిన నేపథ్యంలో డివిజనల్, మండల స్థాయిలో పని చేస్తున్న అధికార యంత్రాంగానికి స్థాన చలనం కలిగే అవకాశం ఉంది. ఆర్డీవో, ఏసీపీ, సీఐ, ఎస్సైలు, ఇక మండలంలో రెవెన్యూ పరిధిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలను సైతం వేరే చోటుకు పంపించే అవకాశం ఉంది. వీరితోపాటు జిల్లాలోని ఆయా శాఖల్లో పని చేస్తున్న అధికారులు తాము కోరుకున్న చోటు కోసం వినతులు అందిస్తున్నారు. చాలామంది అధికారులు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పని చేస్తున్నారు. ఎన్నికలు ముగిసి పాలన గాడిన పడేందుకు అధికారులను తప్పనిసరిగా బదిలీ చేయాలనే ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో ట్రాన్స్‌ఫర్లు అనివార్యమయ్యాయి. ఈ క్రమంలో తమకు కోరుకున్న పోస్టింగ్‌ల కోసం ఆయా శాఖల్లోని అధికారులు తమకు తోచిన విధంగా పైరవీలు చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసి వెళ్లిన వారంతా మళ్లీ జిల్లాకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో 'మంచి' పోస్టింగ్ దక్కని వారంతా ఈసారి దక్కించుకునే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో వచ్చే వారంలోపు జిల్లాలో పూర్తి స్థాయిలో బదిలీలు జరిగే అవకాశం ఉంది.

'ఎమర్జెన్సీ దేశానికి మాయని మచ్చ'



మౌన ప్రదర్శనలో ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, పార్టీ నాయకులు

మంచిర్యాలటౌన్: నాటి ఎమర్జెన్సీ దేశానికి మాయని మచ్చని, కాంగ్రెస్ పార్టీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం 21నెలలపాటు ఎమర్జెన్సీ విధించిందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ విమర్శించారు. ఎమర్జెన్సీ దినాన్ని ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా మంగళవారం బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహించారు. జిల్లా కేంద్రం మంచిర్యాలలో మౌన ప్రదర్శన, నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని అర్చనటెక్స్ చౌరస్తా నుంచి గాంధీ పార్కు వరకు మౌన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం హరీష్‌బాబు, రఘునాథ్ మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ దుష్ప్రచారం చేసే కాంగ్రెస్ పార్టీ 75సార్లు మార్చిందని విమర్శించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, రజనీశ్‌జైన్, దుర్గం అశోక్, పట్టి వెంకటకృష్ణ, కొయ్యల ఏమాజి, జోగుల శ్రీదేవి, ముదాం మల్లేశ్, గుండా ప్రభాకర్, బోయిని హరికృష్ణ, నాగేశ్వర్‌రావు, రమణరావు, మోటపలుకుల తిరుపతి, అక్కల రమేశ్, రాచర్ల సంతోశ్, జాడి తిరుపతి, దార కళ్యాణి, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం దిశగా చర్యలు

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు నిర్మల కాంతి విస్లే, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీల నిర్వహణ, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, ట్రాన్స్‌జెండర్ల ధ్రువపత్రాల జారీ, పిల్లల దత్తత, వయోవృద్ధుల పోషణ ఇతర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లలకు విద్యాబోధనపై టీచర్లకు ప్రత్యేక శిక్షణ అందించడంతోపాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలను పర్యవేక్షిస్తూ శామ్-మామ్ పరిధిలోకి వచ్చే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు నలుగురు ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు జారీ చేశామని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం దిశగా టోల్‌ఫ్రీ నంబరు 14567 ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నామని, పోషణలో నిర్లక్ష్యం వహించడంపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి కే.చిన్నయ్య, బాలల పరిరక్షణ సమితి అధికారి ఆనంద్, సీడీపీవోలు పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు వద్దు

- దూరభారంగా ఆదర్శ వసతిగృహాలు
- అడ్మిషన్లు ప్రిన్సిపాల్‌లకు.. పర్యవేక్షణ ఎస్‌వోలకు..
- పనిభారం తగ్గించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- డీఈవో యాదయ్యకు కేజీబీవీ ప్రత్యేక అధికారుల వినతి



డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు

మంచిర్యాలఅర్బన్: మోడల్ స్కూల్(ఆదర్శ పాఠశాల) ఆవరణలోని వసతిగృహాల అడ్మిషన్ల బాధ్యతలు ప్రిన్సిపాల్‌కు, వసతిగృహాల నిర్వహణ కేజీబీవీ ఎస్‌వోలకు అప్పగించడంతో పర్యవేక్షణ గందరగోళంగా మారుతోంది. మోడల్ స్కూల్‌కు అనుబంధంగా ఉన్న బాలికల వసతిగృహాల నిర్వహణ బాధ్యతలను సమీప కేజీబీవీ ప్రత్యేక అధికారు(స్పెషల్ ఆఫీసర్)లకు అప్పగించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అప్పట్లో మోడల్ స్కూల్ ప్రాంగణంలోని బాలికల వసతిగృహాల నిర్వహణ బాధ్యత తమది కాదని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాళ్లు కోర్టు ద్వారా ఉత్తర్వులు పొందిన నేపథ్యంలో సమీప కేజీబీవీ ఎస్‌వోలకు అప్పగించారు. కేజీబీవీల్లో పాఠశాల, హాస్టల్, కళాశాల పర్యవేక్షణతోపాటు ఆదర్శ హాస్టళ్ల అదనపు భారంపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

వసతిగృహాలు ఇలా..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోడల్ స్కూళ్లలో విద్యార్థుల సౌకర్యార్థం, బాలిక విద్యను ప్రోత్సహించాలని 2012లో ఆర్‌ఎంఎస్‌ఏ ద్వారా మోడల్ వసతిగృహాలు అందుబాటులోకి తెచ్చారు. మోడల్ స్కూల్, ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. తర్వాత కాలంలో సమగ్ర శిక్ష పరిధిలోకి తీసుకొచ్చి వసతిగృహాల నిర్వహణకు సంబంధించి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఎఫ్‌ఏవోకు చెక్‌పవర్ ఇచ్చారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలతోపాటు తరగతుల బోధన నేపథ్యం హాస్టళ్ల నిర్వహణ భారం కావడం వల్ల బాధ్యతల నుంచి తప్పించాలని కోర్టుకు వెళ్లడంతో సమీప కేజీబీవీల ఎస్‌వోలకు పర్యవేక్షణ అప్పగించారు.

దూరభారం

కోటపల్లి మోడల్ స్కూల్, వసతిగృహానికి స్థానిక కేజీబీవీ సుమారు రెండు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంటుంది. అక్కడికి వెళ్లి రావాలంటే గంటలు గడుస్తుంది. అటు వసతిగృహం ఇటు కేజీబీవీ బాధ్యతలు నిర్వహించాలంటే కష్టతరమే. దండేపల్లి మండలం లింగాపూర్‌లో మినహా కాసిపేట, మంచిర్యాల, కోటపల్లి, మందమర్రి ఆదర్శ పాఠశాలల్లో వసతిగృహాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వసతిగృహంలో 100 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. మొదటి ప్రాధాన్యతలో కళాశాలల విద్యార్థులకు చోటు కల్పిస్తున్నారు. అడ్మిషన్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌కు అప్పగించి అందుబాటులో ఉండే వసతిగృహాలు కేజీబీవీల ఎస్‌వోలకు అప్పగించడంపైనా అభ్యంతరాలున్నాయి.

నిర్వహణ భారం..

కేజీబీవీలో 6 నుంచి పదో తరగతి వరకు 200 మంది, ఇంటర్ ఉన్న విద్యాలయంలో 360 మంది వరకు బాలికలు చదువుతున్నారు. వీరందరి పర్యవేక్షణ కేజీబీవీల ఎస్‌వోలపైనే ఉంటుంది. బోధన, వసతిగృహాల వరకు అన్నీ చూడాల్సిందే. కేజీబీవీలకు దూరంగా ఉండే మోడల్ స్కూల్ ప్రాంగణంలోని హాస్టల్ పర్యవేక్షణ ఎస్‌వోలకు ఎలా సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆర్థిక నిర్వహణ తోపాటు పేరేంట్ వచ్చినప్పుడు విద్యార్థి బాగోగులపై చర్చించడం.. చదువుతోపాటు విద్యార్థిని బాధ్యతలు కేజీబీవీతోపాటు మోడల్ హాస్టళ్లు చూడడం కష్టతరంగా మారింది.

డీఈవోకు వినతి

'ఉన్నతాధికారుల ఆదేశానుసారం 2022 ఆగస్టు 24న ఆదర్శ పాఠశాల(మోడల్‌స్కూల్) వసతిగృహాల ఇంచార్జీగా అదనపు బాధ్యతలు స్వీకరించాం. కేజీబీవీలలో 360 మంది విద్యార్థులు ఉండడంతో అకాడమీ, హాస్టల్ నిర్వహణ బాధ్యతలు చూడడం కష్టతరంగా మారింది. ఆర్థిక అవసరాల నిమిత్తం సొంత డబ్బులను వినియోగించడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. మోడల్ స్కూల్ ఆవరణలో ఉండే వసతిగృహాలు మాకు దూరంగా ఉండడం వల్ల సిబ్బంది, విద్యార్థినులను పర్యవేక్షించడం ఇబ్బందిగా మారింది. అదనపు బాధ్యతలు తప్పించాలి..' అంటూ డీఈవో యాదయ్యకు మంగళవారం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు వినతిపత్రం అందజేశారు.

ఒత్తిడికి గురవుతున్నారు..



కేజీబీవీ ప్రత్యేక అధికారులకు మోడల్ స్కూల్ హాస్టల్, ఫైనాన్షియల్ అడ్మినిస్ట్రేషన్ అదనపు బాధ్యతలు కేటాయించడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పనిభారం ఎక్కువ అవుతోంది. హాస్టల్ బాధ్యతల నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్‌టీయూ తెలంగాణ

విద్యాప్రమాణాలు తగ్గిపోతాయి



కేజీబీవీలు, మోడల్ వసతిగృహాల పర్యవేక్షణ బాధ్యతలు స్పెషల్ ఆఫీసర్లకు అప్పగించడం వల్ల విద్యా ప్రమాణాలు తగ్గిపోతాయి. పనిభారం వల్ల డ్యూటీలు సక్రమంగా నిర్వహించలేకపోయే అవకాశాలున్నాయి. జాబ్‌చార్ట్, కాంట్రాక్టు అగ్రిమెంట్‌లో లేని అదనపు బాధ్యతలు ఎస్‌వోలకు అప్పగించిన అసంబద్ధ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి.

– పత్తి సత్తయ్య, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆంధ్రా కాలనీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జన్నారం మండల చెరుకుగూడెం గ్రామానికి చెందిన గొల్లె రాజం (50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న మధ్యాహ్నం ఆంధ్రాకాలనీ వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా ఎన్టీఆర్ చౌరస్తా నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న బైక్ రాజంను ఢీకొనడంతో కిందపడి తలకు తీవ్ర గాయమైంది. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. రాజంకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అంకుసాపూర్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని, ఎలాంటి ఆధారాలు లభించలేదని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని మార్చురీకి తరలించామని తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

పరస్పర దాడిలో ఇరువర్గాలపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామం పోచంపాడు శివారులోని ఓ భూ వివాదంలో పరస్పర దాడిలో ఇరువర్గాలపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచంపాడు శివారులోని మూడు ఎకరాల భూమిలో నస్పూర్‌కు చెందిన బోరిగం వెంకటేశ్ విత్తనాలు నాటుతుండగా నస్పూర్‌కు చెందిన సామ్యూల్, అతడి సోదరుడు ప్రేమ్‌సాగర్ అడ్డుకున్నారు. ఆ భూమి తమదంటే తమదని వాగ్వాదానికి దిగి గొడవ పడ్డారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపైనొకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భీమన్నదేవుడికి జలాభిషేకం

భీమిని: వర్షాలు పడాలి.. పంటలు పండాలని మంగళవారం కన్నెపల్లి మండల కేంద్ర పరిధిలోని భీమన్న దేవుడికి మహిళలు జలాభిషేకం చేశారు. కన్నెపల్లికి చెందిన సుమారు 100 మంది మహిళలు కిలోమీటర్ మేర నడుచుకుంటూ బిందెలతో నీటిని తీసుకువచ్చి భీమన్న దేవుడి విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులకు పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

అడవిలో 'ఉపాధి'


అడవిలో ఉపాధి హామీ పథకం కింద కుంట నిర్మాణంలో కూలీలు

- డివిజన్‌కు రూ.8.62కోట్లు మంజూరు
- నాలుగు వేల మంది కూలీలకు పని
- అటవీ ఉత్పత్తులపై ఆధారపడొద్దని..

జన్నారం: అడవులపై ఆధారపడి, అటవీ సంపదతో జీవించే వారికి అటవీశాఖ ఉపాధి హామీ పథకంతో పని కల్పిస్తోంది. అటవీ సంపదతో అవసరం లేకుండా చేతినిండా పని లభిస్తోంది. దీంతో కూలీలు అటవీశాఖ అధికారులు చేపట్టే పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో టైగర్‌జోన్ నిబంధనల ప్రకారం అడవులకు వెళ్లే అవకాశం లేదు. ఏళ్లుగా అటవీ ఉత్పత్తులు, అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తున్న వారు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజనులు ఉపాధి కోసం వెదురు, బంక, తేనే, పండ్ల సేకరణ కోసం అడవులకు వెళ్లడాన్ని అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. టైగర్‌జోన్ పేరుతో అడవులకు వెళ్లనీయకపోవడంతో తమకు బతుకు భారమవుతోందని పలువురు గిరిజనులు, గిరిజనేతరుల కోరిక మేరకు అటవీ శాఖ అధికారులు వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

సంవత్సరంలో రూ.8.62 కోట్లు మంజూరు

అటవీశాఖ అభివృద్ధిలో భాగంగా గడ్డి క్షేత్రాల పెంపకం, కందకాలు తవ్వకం, మొక్కలు నాటడం, కుంటల నిర్మాణం పనులు చేపట్టారు. వీటిని ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్నారు. ఈ పనులకు అటవీ ఆధారిత గ్రామాలకు చెందిన గిరిజనులు, గిరిజనేతరులకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ప్రతీరోజు పని దొరకడంతో ఉత్సాహంగా పనులకు వెళ్తున్నారు. డివిజన్ పరిధిలోని 28 గ్రామాలకు చెందిన సుమారు 4000 మంది కూలీలు వంద రోజుల పని పూర్తి చేశారు. ఉపాధి హామీ పథకం కింద మొత్తం రూ.8,62,11,000 మంజూరు కాగా ఇందులో ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2024 వరకు రూ.6,65,08,000 ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. 155 పనులు అడవిలో చేపట్టి ఉపాధి హామీ కింద పూర్తి చేసినట్లు తెలిపారు.

కుంటల అభివృద్ధి

అటవీ ఆధారిత కుటుంబాలకు చేతినిండా పని లభిస్తే అటవీ ఉత్పత్తులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదనే ఉద్దేశంతో ఉపాధి హామీ పనులకు గత నాలుగేళ్లుగా శ్రీకారం చుట్టారు. అటవీ శాఖ ద్వారా ఉపాధి హామీతో అడవుల అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. నీరు వృథా పోకుండా కందకాల తవ్వకం, నీటి నిల్వ కోసం కుంటల నిర్మాణం, వన్యప్రాణులకు ఆహారంగా గడ్డి పెంపకాలు, చెక్ డ్యాంల నిర్మాణం, ఆనకట్టలు తదితర పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడంతో కూలీలకు చేతినిండా పని లభిస్తున్నట్లు తెలిపారు. గతంతో పోలిస్తే రెండేళ్లుగా అడవిలోకి వెళ్లే జనాల సంఖ్య తగ్గుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

అడవులపై ఆధారపడకుండా



అడవులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు చేతినిండా పని కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. గిరిజనులు అడవిపై ఆధారపడకుండా, అటవీ ఉత్పత్తులతో పని లేకుండా పని కల్పిస్తున్నాం. ఉపాధి హామీ పనుల ద్వారా గిరిజనులు అడవులపై ఆధారపడకుండా పని చేసుకుంటున్నారు. ఏడాదిలో రూ.6.65 కోట్లు కూలీలకు చెల్లింపులు చేశాం. అడవుల అభివృద్ధికి అందరూ సహకరించాలి.

– శివ్‌ఆశిష్ సింగ్, డీఎఫ్‌వో

బొగ్గుబావులు సింగరేణికే దక్కాలి

- లాభాల వాటాలో 35 శాతం చెల్లించాలి
- టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

మందమర్రిరూరల్: తెలంగాణలో నూతనంగా ఏర్పాటు చేసే బొగ్గు గనులు భేషరతుగా సింగరేణికే దక్కాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం పాట ద్వారా సింగరేణికి దక్కకుండా కుట్ర చేస్తోందని విమర్శించారు. వేలం పాటలో పాల్గొని బొగ్గు బావులు దక్కించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం కపట నాటకాలు ఆడుతోందని, ఈ విషయాన్ని తెలంగాణ సమాజం, సింగరేణి ఉద్యోగులు క్షమించబోరని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థ వాస్తవ లాభాలు వెంటనే ప్రకటించి 35శాతం వాటా వచ్చే నెల ఉద్యోగులకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, నాయకులు రాజశేఖర్, బడికెల సంపత్, సారంగపాణి, కొండల్‌రావ్, అందె శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరుకావాలి


గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి, అధికారులు

శ్రీరాంపూర్: ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021నుంచి 2023వరకు సంవత్సరంలో ఒక్క మస్టర్ కూడా చేయని ఉద్యోగులు ఉన్నారని, ఇది క్రమశిక్షణ రాహిత్యమేనన్నారు. నిర్ణీత మస్టర్లు చేయకుంటే, కంపెనీ ఉద్యోగాల నుంచి తొలగించే అవకాశం ఉంటుందన్నారు. సక్రమంగా విధులకు హాజరై హాజరుశాతాన్ని ఇప్పటికైనా పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, ఏరియా ఎస్ఓటుజీఎం పురుషోత్తం రెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్‌పై ఫిర్యాదు

చెన్నూర్: రైతుల నుంచి లంచాలు వసూలు చేస్తున్నాడని చెన్నూర్ బీట్ ఆఫీసర్ రవికుమార్ పై ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వర్షాకాలంలో కావడంతో అటవీ ప్రాంతంలో ఎండిపోయిన వంట చెరుకు తీసుకొని వస్తే ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్‌కు చెందిన బొడమీద శ్రీనివాస్, పోచన్న, చెన్న నారాయణలకు చెందిన గొడ్డళ్లను గుంజుకొని, బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. నాకు రూ.2వేలు ఇస్తే కేసు ఉండదని, ఫారెస్ట్ ఆఫీస్‌కు వెళ్తే పెద్ద ఎత్తున ఫైన్ పడుతుందని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫారెస్ట్ ఉన్నతాధికారులు బీట్ ఆఫీసర్ వ్యవహారంపై విచారణ జరిపి, శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నా యకులు చింతల శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'మమత' సహకార సంఘం ఎన్నికలు రద్దు


నామినేషన్ వేసేందుకు వచ్చిన వారిని బయటకు పంపిస్తున్న పోలీసులు

- నామినేషన్ల స్వీకరణ సమయంలో ఉత్తర్వులు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల హైడ్రామా

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని మమత వినియోగదారుల సహకార సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ పాలకమండలి ఎన్నికలు రద్దయ్యాయి. ఈ నెల 19న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, ఎన్నికల అధికారిగా లక్సెట్టిపేట అసిస్టెంట్ రిజిస్ట్రార్ సందీప్‌కుమార్‌ను నియమించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న సంఘ కార్యాలయంలో ఈ నెల 24 నుంచి 26వరకు నామినేషన్లు స్వీకరించాల్సి ఉంది. నామినేషన్లు వేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు తొమ్మిది మంది రాగా ఎన్నికల అధికారి సందీప్‌కుమార్ కార్యాలయంలో లేరు. సభ్యులు గంటన్నరసేపు ఎదురుచూశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో రావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వారంతా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు కావడం, కాంగ్రెస్ పార్టీ వారు పెద్ద సంఖ్యలో రావడంతో అందరినీ పట్టణ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో బయటకు పంపించారు. గంటన్నర తర్వాత ఎన్నికల అధికారి వచ్చి ఎన్నికల నోటిఫికేషన్ రద్దయినట్లు ప్రకటించారు. మొదటి రోజు ఎవరూ నామినేషన్ వేయలేదని, ఎన్నిక రద్దు చేస్తున్నట్లు స్టేట్ కోఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ అడిషనల్ రిజిస్ట్రార్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రద్దు కాపీని తీసుకు వచ్చేందుకు వెళ్లానని తెలిపారు. కాగా, ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను రద్దు చేయించిందని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, మమత వినియోగదారుల సహకార సంఘ చైర్మన్ యెర్రం తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. నామినేషన్ వేసేందుకు రాగా ఎన్నికల అధికారి అందుబాటులో లేకపోవడం ఏంటని, అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పద్మనగర్‌లో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని పద్మనగర్ కాలనీకి చెందిన అడేటి సాయికిరణ్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారం, 40 తులాల వెండి ఎత్తుకెళ్లారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయికిరణ్ తన తల్లి లక్ష్మి ఆరోగ్యం బాగాలేకపోవడంతో మంచిర్యాలలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మంచిర్యాల నుంచి రాత్రి ఇంటికి వచ్చి తాళం తీస్తే రాలేదు. వెనుకాలకు వెళ్లి చూడగా తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి బంగారం, వెండి నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

ఆదివాసీల భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న పోచయ్య, నాయకులు, బాధితులు


బెల్లంపల్లి: ఆదివాసీల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న అగ్ర కులస్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి కొలవార్‌సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామంలో ఆదివాసీ గిరిజనులకు చెందిన 6.31ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు అగ్రకులస్తులు దాడి చేసి ఆక్రమించుకున్నారని తెలిపారు. అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఆదివాసీ మన్నేవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి భీమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపురి రఘు, నాయకులు గొలిసెట్టి వెంకటస్వామి, నాయిని పెద్దులు, కిష్టయ్య, పోశం, బాధితులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎల్ యంత్రాలు ప్రారంభం


యంత్రాలను ప్రారంభిస్తున్న గని మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై రెండు ఎస్‌డీఎల్ యంత్రాలకు మంగళవారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత యంత్రాల స్థానంలో కొత్తగా వచ్చిన యంత్రాలు గని ఉత్పత్తి పెంచడానికి, ఆపరేటర్ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రారంభించినట్లు తెలిపారు. రక్షణతో కూడిన మంచి ఉత్పత్తి సాధించడంలో ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, కార్మికులు, సూపర్‌వైజర్లు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని ఇంజనీర్ కిషోర్‌కుమార్, సూపర్‌వైజర్ నాయిని శ్రీనివాస్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, రవికిరణ్, సారంగపాణి, రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలి'


బూత్ అధ్యక్షులతో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

చెన్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చెన్నూర్‌లో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు అన్నారు. మంగళవారం చెన్నూర్ పట్టణంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఓట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి లీడ్ రావడం శుభపరిణామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఎంపీ ఎన్నికలలో లీడ్ వచ్చిన బూత్ అధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, దుర్గం అశోక్, రజనీష్ జైన్, పట్టి వెంకటకృష్ణ, రాపర్తి వెంకన్న, కొండపాక చారి, వెంకటనర్సయ్య, కమ్మల శ్రీనివాస్, కేవీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 168మంది హాజరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో మంగళవారం పాలిసెట్–2024 కౌన్సెలింగ్ నిర్వహించారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు హాజరయ్యారు. ఒక్కో విద్యార్థి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అధికారులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మొత్తం 168 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు.

సెల్లార్ ప్రహరీ కూలి నలుగురికి గాయాలు

- ముందస్తుగా హెచ్చరించిన మున్సిపల్ కమిషనర్
- నోటీసులు అందజేసినా బేఖాతర్ చేసిన ఇంటి యజమాని


స్వల్పంగా గాయపడిన రాములు


తీవ్రంగా గాయపడిన గంగరాజు


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా సమీపంలో మంగళవారం సెల్లార్ ప్రహరీ కూలి నలుగురు కూలీలు గాయపడ్డారు. ఇటీవల సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు మృతిచెందిన ఘటన మరవకముందే మరో ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వెన్నంపెల్లి లక్ష్మీనారాయణ నూతన భవన నిర్మాణం చేపడుతున్నాడు. సెల్లార్ కోసం పక్కనే ఇటుకలతో పది రోజుల క్రితం ప్రహరీ నిర్మించారు. పక్కనే సిమెంట్ పిల్లర్ల మధ్యలో మట్టి పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఇటుకల ప్రహరీ కూలి కూలీలపై పడింది. దీంతో కాసిపేట మండలం ధర్మరావుపేటకు చెందిన అరికెల గంగారాజు తీవ్రంగా, శ్రీరాంపూర్‌కు చెందిన పశుల మల్లయ్య, సీతరామ్‌పల్లికి చెందిన ఐటిపాముల రాములు, సోమగూడంకు చెందిన సర్వయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక సీఐ బన్సీలాల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు తెలిపారు.

నోటీసులు ఇచ్చినా రక్షణ చర్యలు పాటించలేదు..

ఈ నెల 13న జిల్లా కేంద్రంలో సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు కూలీలు దుర్మరణం చెందిన నేపథ్యంలో నూతనంగా భవన నిర్మాణాలు చేపడుతున్న ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు. పనుల్లో, సెల్లార్ నిర్మాణంలో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో లక్ష్మీనారాయణకు సైతం నోటీస్ అందజేశారు. అయినా నిబంధనలు బేఖాతర్ చేస్తూ కూలీలకు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై కమిషనర్ ఇంటి యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మహారాష్ట్రకు తరలిస్తున్న ఎరువుల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..


పట్టుబడిన ఎరువుల వాహనం

చెన్నూర్: చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు ఎరువులు తరలిస్తున్నారని 'సాక్షి'లో 'సరిహద్దు దాటుతున్న ఎరువులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు ఎరువులు అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు జాతీయ రహదారి సమీపంలో తనిఖీలు చేయగా గోదావరిరోడ్డు సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద బొలేరో వాహనంలో 60బస్తాల కాంప్లెక్స్ ఎరువులను పట్టుకున్నట్లు వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఎరువుల విలువ రూ.72వేలు ఉంటుందని తెలిపారు. ఎరువుల బస్తాల వాహనాన్ని పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు, ఎరువులను మహారాష్ట్రకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెస్క్యూ సిబ్బందికి సన్మానం


ప్రశంసాపత్రాలు పొందిన రెస్క్యూ సిబ్బందితో అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీల్లో క్లిష్ట పరిస్థితుల్లో సేవలు అందించిన రెస్క్యూ సిబ్బందిని ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్‌లోని ఇల్లందు క్లబ్‌లో ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లును ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, ఇతర అధికారులు శాలువాతో సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఎస్ఓటు జీఎం పురుషోత్తంరెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారులు ఎం.శ్రీనివాస్, టీ.శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు చిరంజీవి, అరవిందరావు పాల్గొన్నారు.